

# తాడుముక్క (The piece of string)

ఆంగ్లమూలం: గై ద మపాసా

ఆ వేళ సంత రోజు. గోదర్ విల్ చుట్టుపక్కల ఊళ్లలో వుండే రైతులూ, వాళ్ల భార్యలూ సంతకు వస్తున్నారు. కష్టపడి పని చేసిన శరీరాలు వాళ్లవి. నాగళ్ల వెత్తి భుజాలు కాయలు కాశాయి.

గోధుమపంట కోసి చేతులు మొరటుబారాయి. కొంతమంది రైతులు ఆవునో, లేగదూడలో సంతకు తోలుకెళ్తున్నారు. వాటి మెడకు కట్టిన తాడు పట్టుకుని భర్త ముందు పోతుంటే, భార్య చేతిలో వున్న చెట్టుకొమ్మతో వాటినదిలించి, అవి వేగంగా నడిచేట్టు చేస్తోంది. కొంతమంది స్త్రీల నెత్తిన పెద్ద పెద్ద బుట్టలున్నాయి. వాటిలో నుంచి కోళ్లో, బాతులో మెడలు పైకి వెళ్లబెట్టి చూస్తున్నాయి. వాళ్లు తమ భర్తల కంటే చురుగ్గా, వేగంగా నడుస్తున్నారు. కృశించిన శరీరాల చుట్టూ శాలువలు కప్పుకుని, వాళ్లు చదునైన వక్షాలకు పైగా వాటికి పిన్ను పెట్టుకుని వున్నారు ఆ స్త్రీలు. తెల్లటి గుడ్డ జుట్టు నతుక్కుని వాళ్ల తలలను కప్పుతున్నది. దానిపై కాప్ పెట్టుకున్నారు. అంతలో ఓ గుర్రబ్బండి ఊగుతూ గతుకుల రోడ్డులో పడుతూ లేస్తూ ముందుకు వెళ్లింది. ముందు వైపు ఇద్దరు మగవాళ్లు పక్కపక్కన కూర్చునున్నారు. బండి మధ్యలో ఓ స్త్రీ గతుకులను తట్టుకునేందుకు బండి పక్క కర్ర పట్టుకుని కూర్చుంది.

గోదర్ విల్ సంత జనసందోహపు గుంపులతో, జంతువులతో సందడిగా వుంది. పశువుల కొమ్ములూ, ఎత్తయిన హాట్లూ, రైతు స్త్రీల శిరస్త్రాణాలూ ఆ గుంపులో ఎత్తుగా కనిపిస్తున్నాయి. అరుపులతో, పిలుపులతో, వాగ్వివాదాలతో, పశువుల అంబారవాలతో, నవ్వులతో మహా గందరగోళంగా వుంది సంత. గుర్రపుశాలల వాసన, పశువుల కొట్టాల కంపు, గడ్డి, చెమట వాసనలు-పొలాలకు చెందిన మనుషుల, పశువుల దుర్గంధం వీస్తున్నది అంతటా.

బ్యూత్‌కు చెందిన హాచ్ కం అప్పుడే వచ్చాడు, గోదర్ విల్‌కు. అతను సంత వేపుగా అడుగులు వేస్తున్నప్పుడు, నేల మీద అతనికో తాడుముక్క కనిపించింది. హాచ్ కం నిజమైన నార్మన్‌లా చాలా పొదుపరి. ఉపయోగపడే ప్రతి వస్తువునూ ఏరి, దాచుకోవాలనే తత్వం అతనిది. కీళ్ల నొప్పులతో, మోకాళ్లు మారాం చేస్తున్నా కష్టపడి నేల మీదికి వంగి తాడు ముక్కను చేతిలోకి తీసుకుని, జాగ్రత్తగా దాన్ని వేలితో చుట్ట చుట్టసాగాడు. అప్పుడే గుర్రపు జీనులు తయారుచేసే మలాన్డయిన్ తన ఇంటి గుమ్మంలో నుంచి తన్ను చూడటం గమనించాడు హాచ్ కం. అంతకుముందు కళ్లె విషయంలో వారిద్దరికీ పేచీ వచ్చింది. తగాదా పడ్డారు. ఆ తర్వాత ఒకళ్లంటే ఒకళ్లకు పడకపోయింది. బద్ధశత్రువులయ్యారు. చెత్తాచెదారంలో నుంచి ఓ తాడు ముక్కనలా తీయటం తన శత్రువు గమనించటంతో హాచ్‌కంకు సిగ్గనిపించింది. క్షణంలో తనకు దొరికిన 'నిధి'ని చొక్కా కింద దాచేసి, మెల్లగా దాన్ని పాంటు జేబులోకి జార్చేశాడు. ఇంకా తనకు కావలసిందేదో కనపడనట్టు. అలాగే నేలను పరికిస్తూ కాస్త సేపు గడిపాడు. ఆ తర్వాత మెడ ముందుకు సాచి, మోకాళ్లు నొప్పి పుడుతుంటే ముందుకు వంగి, సంత దిశగా ముందుకు సాగాడు.

సంతలో అనంతంగా బేరసారాలు సాగుతున్నాయి. అలా వ్యస్తమైవున్న గుంపుల్లో అతను కలిసిపోయాడు. రైతులు బేరాలు చేశారు. అక్కర్లేదంటూ వెళ్లిపోయారు, తిరిగివచ్చారు;

తమను మోసం చేస్తున్నారేమోనని భయపడి పోతుంటారు. నిర్ణయం తీసుకునే ధైర్యం చేయలేదు. అమ్మేవాడి కళ్లల్లోకి చూస్తూ, అక్కడ మోసముందేమోనని పరికిస్తూ, కొనబోయే పశువులో లోపాలు ఎంచుతూవుంటారు. స్త్రీలు తెచ్చిన గంపలను కాళ్ల దగ్గర పెట్టుకుని, ఎఱ్రటి తురాయి, భయంతో కంపించే కళ్లతో, కాళ్లు కట్టిన కోళ్లను అమ్మజూపుతున్నారు. అడిగినవాళ్లకు బేరం చెప్పారు. అమ్మాలన్న ఆతురత వాళ్ల ముఖాల్లో కనిపించలేదు; అంతలో కొనుగోలుదారులు, నడిచిపోతూంటే, పెద్దగా అరుస్తూ వెనక్కి పిలిచి, "అలాగే, ఆర్థిన్, అంతకైతే ఇస్తాను" అంటారు.

మెల్లమెల్లగా మధ్యాహ్నానికల్లా సంత ప్రదేశం నిర్జనమైపోయింది. జోర్డెయిన్ కాకా హోటలు దగ్గర జనం గుమిగూడారు. పెద్ద హాలు నిండా జనం కూర్చుని ఫలహారాలు తింటున్నారు. హోటలు బయట రకరకాల బళ్లు జమ అయివున్నాయి. కొన్ని బళ్ల కాడి కఱ్ఱలు ఆకాశాన్ని చూస్తుంటే, కొన్ని నేలకు వాల్చి వున్నాయి. గుఱ్రాలనూ, ఎద్దులనూ పక్కన కట్టేశారు. బల్లల ముందు కూర్చుని తింటున్నవాళ్ల ముందు పెద్ద కుంపటి వుంది. దాంట్లో కట్టెలు మండుతున్నాయి. కుంపటి నుంచి వచ్చే వేడి హాయి అనిపిస్తోంది. మూడు ఇనపకడ్డీలకు గుచ్చి కోళ్లూ, పావురాళ్లూ, గొఱ్రెకాళ్లూ వేలాడుతున్నాయి. వేయించిన ఆవు మాంసం, గ్రేవీల చక్కటి వాసన కుంపటి మీదుగా వీస్తూ అందరికీ నోరూరించేటట్లుగా వున్నది.

జోర్డెయిన్ హోటల్‌లోనే కృషీవలులంతా భోజనం చేస్తారు. ఆ హోటలు యజమాని, జోర్డెయిన్ దొంగ వెధవ, డబ్బున్నవాడు, గుఱ్రాల వ్యాపారి కూడా. పళ్లాలు సరఫరా అవుతున్నాయి. ఖాళీ అవుతున్నాయి. పసుపు పచ్చని ఆపిల్ పళ్ల సారాయి జగ్గులు ఖాళీ అవుతున్నాయి. అందరూ తమ తమ సొంతవిషయాలను గురించి చెప్పుకుంటున్నారు. తమ కొనుగోళ్లు; అమ్మకాల గురించి చెప్పుకోసాగారు. పంటలను గురించి చర్చించుకుంటున్నారు. వాతావరణం కూరగాయలు పండించటానికే అనువుగా వుంది కానీ, గోధుమపంట అంత బాగా లేదు అని చెప్పుకోసాగారు.

అంతలో హోటలు బయట ఆవరణలో తప్పెట మోత వినిపించింది. ఏ కొద్దిమంది బద్ధకస్తులో తప్ప అందరూ లేచి కిటికీలూ, తలుపుల దగ్గరకు పరుగెత్తారు. తింటున్న పదార్థాలతో వాళ్ల నోళ్లు ఇంకా నిండేవున్నాయి.

వెట్టివాడు తప్పెట మోగించటం ఆపేసి, తడబడుతూ జనం వినేట్టుగా పెద్దగా చెప్పాడు. "గోదర్ విల్ గ్రామవాసులకూ, సంత కొచ్చిన మనుషులకందరికీ ఇందు మూలంగా తెలియజేయట మేమనగా బెజ్జెవిల్ రోడ్డు మీద, ఈ దినం తొమ్మిది-పది గంటల మధ్య మన్నెవిల్ గ్రామవాసి అయిన ఫార్చ్యూన్ హాల్‌బ్రెక్ గారు తన నల్లచర్మపుపర్సును పోగొట్టుకున్నారు. అందులో ఐదు వందల ఫ్రాంకుల డబ్బూ, కొన్ని వ్యాపారపత్రాలూ వున్నాయి. దాన్ని చూసినవారు వెంటనే మేయర్ గారి కార్యాలయంలో గానీ, లేక హాల్ బ్రెక్ గారికి గానీ అందజేయవలసింది; అందుకు ఇరవై ఫ్రాంకులు బహుమానం ఇస్తారు."

ఆ తర్వాత వెట్టివాడు వెళ్లిపోయాడు. అతని గొంతూ, తప్పెట శబ్దమూ మళ్లీ దూరంగా వినిపించాయి. రైతులు ఆ సంఘటనను గురించి చర్చించసాగారు. హాల్ బ్రెక్‌కు ఆ పర్సు దొరకటం, దొరకకపోవటంలో గల అవకాశ, అనవకాశాల గురించి మాట్లాడుకోసాగారు.

భోజనం పూర్తయింది. వాళ్లు కాఫీ తాగుతున్న సమయంలో పోలీసు ఇన్‌స్పెక్టర్ వచ్చి తలుపు దగ్గర నిలబడ్డాడు. "బ్యూత్‌కు చెందిన హాచ్ కం ఇక్కడున్నాడా?" అని అడిగాడు.

టేబుల్‌కు అటువైపుగా కూర్చున్న హాచ్ కం

**అనువాదం: కాకాని చక్రపాణి**

"నేనిక్కడే వున్నా" అని జవాబిచ్చాడు.

"హాచ్ కం! నువ్వు నాతో పాటు మేయర్ గారి ఆఫీసుకు రావాలి. మేయరు గారు నీతో మాట్లాడతారట" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఆ రైతు ఆశ్చర్యపడిపోయాడు, ఖంగు తిన్నాడు, తన చిన్న గ్లాసులో వున్న బ్రాందీని ఒక్క గుక్కలో తాగేశాడు. పొద్దున కంటే మరీ వంగిపోయి లేచాడు. విశ్రాంతి తీసుకుని లేచాక, మొదటి అడుగు వేయడం ఎప్పుడూ కష్టమే అతనికి. లేచి, "పద, వస్తున్నాను" అంటూ బయలుదేరాడు.

మేయర్ ఇతని కోసం నిరీక్షిస్తూ, చేతుల కుర్చీలో కూర్చునివున్నాడు. ఆ ప్రాంతాల్లో నోటరీ కూడా అతనే. లావుగా గంభీరంగా వుండే మనిషి, శబ్దాడంబరం ఎక్కువ.

"హాచ్ కం, ఇవాళ పొద్దున మన్నెవిల్‌కు చెందిన హాల్ బ్రెక్ పర్సును బెజ్జెవిల్ రోడ్డు మీద నుంచి తీసి నువ్వు జేబులో వేసుకున్నావని తెలిసింది" అన్నాడాయన.

ఆ పల్లెటూరి పెద్దమనిషి ఆ మాటలకు మ్రాన్పడిపోయాడు. ఎందువల్ల తనపై అలాంటి సందేహం కలిగిందో అతనికి తెలియనప్పటికీ, అనుమానం కలిగినందుకే భయభీతుడైపోయి, అతను మేయర్ వంక చూశాడు.

"నేను... నేను... నేను పర్సును తీశానా?"

"అవును. నువ్వే తీశావు."

"నా గౌరవం మీద ఆన. నాకు దాని సంగతే తెలీదు."

"కానీ, నువ్వా పని చేయటం చూసినవాళ్లున్నారు."

"నన్ను చూశారా? అట్టా అని చెప్పిందెవరు?"

"గుఱ్రాల జీన్లు తయారు చేసే మలాన్డయిన్."

ముసలి రైతుకు గుర్తుకు వచ్చింది, అర్థమైంది, కోపంతో అతని ముఖం ఎఱ్రనైంది. "ఎవడు? ఆ బండ వెధవ నన్ను చూశాడా? ఇదుగో, ఈ తాడు ముక్కను నేను తీయటం చూశాడు వాడు!" అంటూ పాంటు జేబు గాలించి, తాడుముక్కను చూపించాడు అతను.

కానీ మేయర్ అపనమ్మకంతో, తల అడ్డంగా వూపాడు. "మలాన్డయిన్ నమ్మదగిన మనిషి. అతను ఈ తాడుముక్కను పట్టుకుని పర్సని భ్రమించే మనిషి కాదు. హాచ్ కం! నువ్విలా నన్ను నమ్మించలేవు!"

రైతు చెయ్యెత్తి తన గౌరవప్రతిష్ఠలకు గుర్తుగా గుండెను కొట్టుకుంటూ, కోపంగా అన్నాడు; "దేవుడి సాక్షిగా ఇది నిజం! ప్రమాణం! ఇది నా ఆత్మసాక్షి. కాకపోతే, నేను రౌరవాదినరకాలకు పోతాను!"

మేయర్ చెప్పసాగాడు: "నువ్వా వస్తువు తీశాక మేడిపోగలాగ నిలబడ్డావట. ఇంకా డబ్బేమైనా బురదలో పడ్డదా అని చాలా సేపు చూస్తూ నిలబడ్డావట!"

ఆ ముసలి మనిషి కోపంతో, భయంతో ఓ క్షణం మాట్లాడలేకపోయాడు."ఎవడైనా ఎట్టా-ఎట్లా కూస్తాడు, అట్టాంటి తప్పుడు మాటల్ని, మనిషి పరువు తీసే త్రాష్టపుమాటల్ని! ఎవడైనా ఎట్టా-"

వ్యతిరేకించినందువల్ల ప్రయోజనం లేకపోయింది; ఎవరూ అతని మాటలను నమ్మలేదు. మలాన్డయిన్‌ను అతని ఎదుట ప్రవేశపెట్టారు. అతను మళ్లీ స్పష్టంగా అవే మాటలు చెప్పాడు. వాళ్లు ఓ గంట సేపు ఒకళ్లనొకళ్లు తిట్టుకున్నారు. హాచ్ కం అడిగిన మీదట, అతన్ని శోధించారు. అతని ఒంటి మీదా, బట్టల్లోనూ ఏమీ దొరకలేదు.

మేయరు అయోమయంలో పడిపోయాడు. తను పబ్లిక్ ప్రాసిక్యూటర్ను సంప్రదించి, ఈ విషయంలో ఏం చేయాలో ఆదేశాలు పొంది, అతని సంగతి తేలుస్తానని చెప్పి హాచ్ కంను

వంపేశాడు, చివరికి.

ఈ వార్త వ్యాపించిపోయింది. అతను మేయరు ఆఫీసు నుంచి బయటపడగానే జనం అతన్ని చుట్టుముట్టారు. కొంతమంది గంభీరంగానూ, కొంతమంది ఎగతాళిగానూ ప్రశ్నలు వేయసాగారు. అతను తాడుముక్క కథ చెప్పసాగాడు. అతని మాటల నెవరూ నమ్మలేదు. వాళ్ళు అతన్ని చూసి నవ్వారు.

వాళ్లన్నారు: "ముసలినక్క, వెళ్లు!" అని.

అతనికి ఆగ్రహం కలిగింది, మంట పుట్టింది; తన మాటలు నమ్మనందుకు దుఃఖం కలిగింది; ఏం చేయాలో తోచక, చెప్పిన విషయాన్నే పదే పదే చెప్పసాగాడు.

రాత్రయింది. అతనింక వెళ్లిపోవాలి. ముగ్గురు పొరుగువాళ్లతో అతను బయలుదేరాడు. తనకా తాడుముక్క ఎక్కడ దొరికిందో వాళ్లకు చూపించాడు. తోవ పొడుగూతా తనెలా మేయరు ఆరోపణ నెదుర్కున్నదీ చెప్తూనేవున్నాడు.

ఊరి కెళ్లాక తన ఊరు బ్యూత్‌లో కనిపించిన వాళ్లందరికీ తన కథ వినిపించాడు. ప్రతి చోటా అపనమ్మకాన్ని ఎదుర్కోవలసివచ్చింది అతనికి.

ఇంత ప్రయాసా అతన్ని జబ్బు పడేట్టు చేసింది. మర్నాడు మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో యెమన్‌విల్ రైతు, బ్రెటన్ జీతగాడు, మారియస్ పామెల్ మన్నెవిల్‌కు వెళ్లి హోల్ బ్రెక్‌కు పర్సును, అందులోని పత్రాలతో సహా అందజేశాడు.

ఆ మనిషి కది రోడ్డు మీద కనిపించిందట. తనకు చదువు రాదు కనుక ఎవరిదో తెలుసుకోలేకపోయాడు. దాన్ని ఇంటికి తీసుకెళ్లి తన యజమానికిచ్చాడు.

ఈ వార్త కూడా పరిసరగ్రామాల్లో వ్యాపించింది. హాచ్ కంకూ కబురు చేశారు. అతను వెంటనే ఊరి రచ్చబండ దగ్గరికి వెళ్లి, సుఖాంతమైన తన కథను వినిపించసాగాడు. చివరికి తను నెగ్గాడు. "ఈ జరిగిందానికి నాకు విచారం లేదు. నా బాధల్లా నేను అబద్ధం చెప్పానని భావించడమే! ఓ అబద్ధపుకూత వల్ల అనుమానించటమంత సిగ్గుపడే పని మరొకటి లేదు!"

తన సాహసకృత్యాన్ని గురించి అతడా రోజల్లా మాట్లాడుతూనేవున్నాడు. హై రోడ్డు మీద వెళ్తున్న జనాని కీ విషయం చెప్పాడు; కల్లంగడిలో తాగుతున్న జనానికి చెప్పాడు; ఆదివారం రోజు చర్చి నుంచి వస్తున్న ప్రజకు వినిపించాడు. అపరిచితులను కూడా ఆపి, వాళ్లకు తన కథ వినిపించాడు. అతని కిప్పుడు మనశ్శాంతి కలిగింది. కాని, తనకే నిర్ధారితంగా తెలియనిదేదో అతన్ని కలవరపెట్టసాగింది. జనం అతని మాటలు విన్నారు. కానీ వాళ్ల నోళ్లు నవ్వుతూంటే నొసలు వెక్కిరించినట్లనిపించింది అతనికి. వాళ్లు తన మాటలు నమ్మినట్లనిపించలేదు. తను వెనక్కు తిరగ్గానే, తనను గురించి అవహేళనగా జనం చెప్పుకుంటున్నట్లనిపించింది.

మరుసటి వారం, మంగళవారం రోజు అతను మళ్లీ గోదర్ విల్ సంతకు వెళ్లాడు. పనేం లేదు. అతను ముఖ్యంగా వెళ్లింది, తనకు జరిగిన కిరాతకాన్ని గురించి చర్చించటానికే!

మలాన్డయిన్ తన ఇంటి తలుపు దగ్గర నిలబడి అతను రోడ్డు మీద వెళ్లటం చూసి నవ్వాడు. ఎందుకు?

క్రాక్‌తో గ్రామానికి చెందిన ఓ రైతుకు తన కథ చెప్పటం హాచ్ కం. అతను హాచ్ కం మాటలను పూర్తిగా వినకుండానే, అతని పొట్టలో హాస్యానికన్నట్టు చేత్తో ఓ పోటు పొడిచి, "నువ్వొట్టి దొంగవెధవ్వి!" అని, వెళ్లిపోయాడు.

హాచ్ కం అయోమయంలో పడిపోయాడు; సత్యం బయటపడ్డా వాడెందుకు తనను 'దొంగ వెధవ' అని తిట్టాడు? అతను జోర్డెయిన్ కాకా



హోటల్లో కూర్చుని 'వ్యవహారం' గురించి వివరించసాగాడు.

మాన్విల్యేకి చెందిన గుర్రాల వ్యాపారి, "పో, దొంగ ముసలోడా! అది పాత ట్రిక్కేలే. కొత్తదేం కాదు. నీ తాడుముక్క సంగతి నాకు తెలియకపోలేదు!" అన్నాడు.

హాచ్ కంకు మాటలు తడబడ్డాయి. "కానీ, పర్సు ఎవరికి దొరికిందో తెలిసిపోయిందే!" అన్నాడు.

అందుకు మరో మనిషి జవాబిచ్చాడు: "ఇంక మాట్లాడకయ్యా! ఒకడికి దొరుకుతుంది. మరొకడు రిపోర్టు చేస్తాడు. ఏమైనా నీకీ వ్యవహారంలో నిశ్చయంగా సంబంధం వుంది!"

అతని మాటలను వ్యతిరేకించ ప్రయత్నించాడు హాచ్ కం. టేబుల్ దగ్గర కూర్చున్న వాళ్లందరూ నవ్వసాగారు. అతను తిండి తినలేకపోయాడు. జనం అపహాస్యపు నవ్వుల మధ్య అతను హోటలు విడిచి వెళ్లిపోయాడు.

అతను ఇంటికి వెళ్లిపోయాడు. సిగ్గుతో చితికిపోయాడు. కోపం వచ్చింది. అయోమయంలో పడిపోయాడు. నక్కజిత్తుల మనిషట తాను. దొంగ వెధవట. వాళ్ల ఆరోపణలన్నీ అతనిలో తీవ్రదుఃఖాన్ని కలగజేశాయి. హాస్యానికి తన సంగతే చెప్పుకోవడం అతన్ని క్రుంగదీసింది. తనది 'దొంగ బుద్ధి' అని లోకానికి తెలిసినట్టుగా, తన అమాయకత్వం జనానికెలా రుజువు చేయాలో అతనికి తెలియలేదు. తనను అనుమానించి అవమానించారు. తన పట్ల అన్యాయంగా ప్రవర్తించటం చూసి అతని గుండె పగిలిపోయింది.

మళ్లీ అతను తన పట్ల జరిగిన దురంతాన్ని గురించి చెప్పసాగాడు. రోజురోజుకూ ఆ కథ పొడుగై పోసాగింది. కొత్తకొత్త హేతువులు చూపించసాగాడతను. మరింత గట్టిగా నిరసన ప్రదర్శించాడు, మరిన్ని ఒట్లు పెట్టుకున్నాడు. తన తాడుముక్క కథను గురించి ఒంటరిగా గంటలు ఆలోచించి, తయారుచేసుకున్న వాదాలన్నీ వినిపించాడు. బలం లేని ఆధారాలు, కథను మరింత సంక్లిష్టం చేశాయి. వాదం మరింత సూక్ష్మమైంది. అతని పట్ల జనానికి నమ్మకం కలగలేదు.

"అవన్నీ అబద్ధపుసాకులు. మృషామిషలు!" అన్నారు జనం, అతని వీపు వెనక్కు తిరగ్గానే.

అతని మనస్సు కలత చెందింది. ఆ 'విషయాన్ని' గురించే ఆలోచిస్తూ కాలం గడిపాడు. వ్యర్థప్రయత్నాలతో వృథాప్రయాస పడ్డాడు. మనస్తాపంతో చిక్కిపోయాడు.

తుంటరి వెధవలు తమ వినోదానికి అతని చేత తాడుముక్క కథను చెప్పించుకునేవాళ్లు; యుద్ధరంగాన్నుంచి తిరిగి వచ్చిన సైనికుడి నుంచి అతని వీరగాథలు విన్నట్టు. అతని కథ వినేవాళ్లు, నవ్వేవాళ్లు, అతని మనను కలచివేసినట్లయిపోయింది. మనిషి బలహీనపడిపోసాగాడు.

డిసెంబరు మాసాంతానికల్లా అతను జబ్బుతో పక్క మీది నుంచి లేవలేకపోయాడు. జనవరి తొలిదినాల్లో అతను మరణించాడు; మృత్యువుతో పోరాడుతూ అపస్మారకస్థితిలో సైతం తన అమాయకత్వాన్ని వెల్లడిస్తూ గొణిగేవాడు: "ఇదుగో, చూడు, మేయర్! నేను తీసింది ఈ తాడుముక్కనే, ఈ తాడుముక్కనే!"

■